

https://www.tholikranthidaily.in TEL TEL - 12281

# తొలిక్రాంతి

మన గొంతుకే.. మన పత్రిక

తెలుగు దినపత్రిక..

హైదరాబాద్
శనివారం
6-09-2025

వెల: రూ.4/-
సంపుటి: 01 సంచిక: 40
పేజీలు: 04

Published From: Hyderabad

Editor: Malothu ChandraKala




# ఉప ఎన్నికలు రాబోతున్నాయ్

• బాన్సువాడలో పోచారం ఓటమి ఖాయం • పాలన చేతకాని కాంగ్రెస్ ప్రజలకు క్షమాపణ చెప్పాలి • సుప్రీంకోర్టు తెలంగాణలో జరిగిన ఫిరాయింపులపై స్పష్టమైన ఆదేశాలు ఇచ్చింది • స్పీకర్ నిర్ణయం తీసుకోకపోతే మరోసారి సుప్రీం కోర్టుకు వెళ్తాం • కాంగ్రెస్ పార్టీకి చెందిన పలువురు నేతలు, వందలాది కార్యకర్తలు భారత రాష్ట్ర సమితిలో చేరికలు • బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

హైదరాబాద్, సెప్టెంబర్ 5-(తొలి క్రాంతి):

ఎర్రవెల్లిలోని కేసీఆర్ నివాసంలో జరిగిన చేరికల కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీకి చెందిన పలువురు నేతలు, వందలాది కార్యకర్తలు భారత రాష్ట్ర సమితిలో చేరారు. వీరిలో ఎంపీటీసీల ఫోరం రాష్ట్ర ఉపాధ్యక్షుడు యలమంచిలి శ్రీనివాస్, మాజీ ఎంపీపీ కోటగిరి వల్లేపల్లి శ్రీనివాస్, మాజీ జెడ్పీటీసీ బాన్సువాడ నార్ల రత్న కుమార్, పీఏసీఎస్ వైస్ చైర్మన్ బొట్టె గజేందర్, మాజీ సర్పంచులు పద్మ మొగులయ్య, బంజా గంగారాం, కురలేపు నగేష్, మాజీ కో-ఆప్షన్ హకీమ్ తదితరులు ఉన్నారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. భారతదేశంలోనే నంబర్ వన్ రాష్ట్రాన్ని బంగారు పళ్లెంలో పెట్టి కాంగ్రెస్ చేతిలో పెట్టామని కానీ మిగతా 2లో..

# విద్యలో ప్రపంచంతోనే పోటీ పడాలి

• ప్రతి పేదవాడి తలరాత చదువే మార్చగలదు • కార్పొరేట్ పాఠశాలలకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో విద్య ఎందుకు అందించలేం? • రాష్ట్రంలో ఏటా 40వేల కోట్లు విద్యా రంగం కోసం వ్యయం • ప్రైవేటు టీచర్లకన్నా ప్రభుత్వ ఉపాధ్యాయులకే ఉన్నత విద్యార్హతలు • నర్సరీ నుంచి 12వ తరగతి వరకు పటిష్టమైన ఫౌండేషన్ అవసరం • ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్ స్థాయికి తీసుకెళ్లాలి • గురుపూజోత్సవంలో సీఎం రేవంత్‌రెడ్డి

"విద్యా రంగం అభివృద్ధి కోసం తెలంగాణలో ఏటా 40వేల కోట్లు ఖర్చు పెడుతున్నాం. ఈ పిల్లలే దేశ భవిష్యత్తు. వారి భవిష్యత్తు ఉపాధ్యాయులైన మీ చేతుల్లో ఉంది. రాష్ట్రంలో 1లక్షా 20 వేల మంది ఉపాధ్యాయులు ఉన్నారు. ప్రభుత్వ బడుల్లో ప్రైవేటు స్కూళ్లకంటే నాణ్యమైన విద్యను అందించడానికి అందరం నడుం బిగిద్దాం"
- సీఎం రేవంత్

హైదరాబాద్, సెప్టెంబర్ 5-(తొలి క్రాంతి):

రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్ స్కూళ్లకు ధీటుగా తీర్చిదిద్దుదామని అందరం ప్రతిజ్ఞ చేద్దామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఉపాధ్యాయులకు పిలుపునిచ్చారు. ప్రతి పేదవాడూ ఎదగాలంటే చదువు ఒక్కటే మార్గమని, అందరం కలిసి వారికి నాణ్యమైన విద్యను అందిద్దామని కోరారు "విద్యా రంగం అభివృద్ధి కోసం తెలంగాణలో ఏటా 40వేల కోట్లు ఖర్చు పెడుతున్నాం. ఈ పిల్లలే దేశ భవిష్యత్తు. వారి భవిష్యత్తు ఉపాధ్యాయులైన మీ చేతుల్లో ఉంది. రాష్ట్రంలో 1లక్షా 20 వేల మంది ఉపాధ్యాయులు ఉన్నారు. ప్రభుత్వ బడుల్లో ప్రైవేటు స్కూళ్లకంటే నాణ్యమైన విద్యను అందించడానికి అందరం నడుం బిగిద్దాం" అని అన్నారు. బలమైన తెలంగాణను నిర్మించాలంటే దేశ భవిష్యత్తు గరగతి మిగతా 2లో..





## ఖైరతాబాద్ గణేశుడిని దర్శించిన సీఎం

• దేశంలో ఎక్కడా లేని విధంగా మండపాలకు ఉచిత విద్యుత్
• పోలీసు, మున్సిపల్, రెవెన్యూ, విద్యుత్ శాఖలతో సమగ్ర ఏర్పాట్లు • మత సామరస్యానికి ప్రతీకగా నిలుస్తున్న హైదరాబాద్ నగరం • భక్తి శ్రద్ధలతో నిమజ్జన కార్యక్రమం పూర్తి చేయాలి: సీఎం రేవంత్ రెడ్డి

2



## రైతుల ప్రయోజనాలు దెబ్బతినే రాజకీయాలు చేయకూడదు



• గూగుల్ ప్రచారంపై కాకుండా పనిపై దృష్టి పెట్టాలి • పాలకులే నెగెటివ్ మైండ్‌సెట్‌తో ఉంటే అభివృద్ధి ఎలా సాధ్యం • దేశానికి ఆదర్శంగా నిలిచిన తెలంగాణ • మేడిగడ్డ రిపేర్‌కు కొన్ని వందల కోట్లు చాలు కానీ కాంగ్రెస్ మాత్రం లక్ష కోట్లు అని దుష్ప్రచారం • బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్ రావు

2 వ

హైదరాబాద్, సెప్టెంబర్5-(తొలి క్రాంతి):

లండన్ పర్యటనలో భాగంగా జరిగిన మీట్ అండ్ గ్రీట్ కార్యక్రమంలో బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆయన రాష్ట్ర ప్రయోజనాలు, రైతుల ప్రయోజనాలు దెబ్బ తినే విధంగా రాజకీయాలు చేయకూడదని అన్నారు. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం మిగతా 2లో..

## రైతులపై పోలీసుల వేధింపులు సహించం



• ప్రశ్నించడమే నేరమా? ఇందిరమ్మ రాజ్యమంటే వేధింపులా? • పాలకుల మెప్పుకోసం ప్రజలపై దాడులు చేస్తే మూల్యం చెల్లించుకోవాల్సిందే • జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత

2 వ

హైదరాబాద్, సెప్టెంబర్ 5-(తొలి క్రాంతి):

యూరియా కొరతపై ప్రశ్నించిన రాజన్న సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట మండలానికి చెందిన రైతు లక్ష్మణ్ యాదవ్ ఇంటికి పోలీసులు వెళ్లడంపై ఎక్స్ వేదికగా జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత స్పందించారు. రైతు లక్ష్మణ్ యాదవ్ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని నిలదీశాడని, ఆ వెంటనే పోలీసులు ఇంటికి వెళ్లి వేధింపులకు గురి చేశారని ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు యూరియా కొరతపై ప్రశ్నించడమే నేరమా? ఇందిరమ్మ రాజ్యమంటే వేధింపులు, మిగతా 2లో..



2

## ధరణి, కాళేశ్వరం పేరుతో వనరుల దోపిడీ

• బీఆర్ఎస్ రాజీనామా వెనక అసలైన కారణం కవిత లిక్కర్ కేసే • ఆస్తుల పంచాయతీ ప్రజలకు సంబంధం లేదు • పత్రికలు పట్టించుకోవాల్సిన అవసరం లేదు • స్టేషన్ ఘన్‌పూర్ ఎంఎల్ఎ కడియం శ్రీహరి

## విద్యపై భారీ పెట్టుబడులు

• విద్యపై పెట్టుబడి రాష్ట్ర ప్రగతికి ఉపయోగకరం • స్కిల్ యూనివర్సిటీ సిలబస్ పారిశ్రామిక వేత్తలతో కలిసి రూపకల్పన • యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ ద్వారా ఉచిత ప్రపంచ స్థాయి విద్య • ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు ఐఎస్‌బీలో ఐదు రోజుల ప్రత్యేక శిక్షణ • గచ్చిబౌలిలో మోతిలాల్ ఓస్వాల్ ఎగ్జిక్యూటివ్ సెంటర్ ప్రారంభం • డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క



హైదరాబాద్, సెప్టెంబర్ 5-(తొలి క్రాంతి):

హైదరాబాద్ గచ్చిబౌలిలోని ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్‌లో మోతిలాల్ ఓస్వాల్ ఎగ్జిక్యూటివ్ సెంటర్‌ను డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విద్యా రంగంపై ఎవ్వరూ ఊహించని రీతిలో పెట్టుబడులు పెట్టిందని తెలిపారు. విద్యపై పెట్టుబడి రాష్ట్ర ప్రగతికి ఉపయోగపడుతుందని మా ప్రభుత్వం నమ్ముతోందన్నారు.రాష్ట్ర అభివృద్ధి కోసం ఐఎస్‌బీ విద్యార్థులు సహకరించాలని ఆయన కోరారు. తెలంగాణ రైజింగ్ 2047 పేరుతో మూడు ట్రిలియన్ల ఆర్థిక వ్యవస్థ లక్ష్యంతో పని చేస్తున్నామన్నారు. యువ రాష్ట్రమైన తెలంగాణ ప్రపంచంతో పోటీపడుతోందని, రాష్ట్ర విద్యార్థులకు ప్రపంచ స్థాయి విద్యను పూర్తిగా ఉచితంగా అందించేందుకు యంగ్ మిగతా 2లో..

## నవరాత్రికి డబుల్ ధమాకా

రాత్రికి రాత్రే వచ్చిన నిర్ణయం కాదు!
• ట్రంప్, బిహార్ ఎన్నికలు, ప్రతిపక్షాల ఒత్తిడి శుద్ధ అబద్ధాలే
• జీఎస్టీ సంస్కరణలపై కేంద్రమంత్రి నిర్మలా సీతారామన్
• 18 నెలల క్రితమే కమిటీ.. • 140 కోట్ల మందికి ప్రయోజనం..

2

## రైతు వేదికల్లో యూరియా సేల్ కౌంటర్లు

• ప్రతి రైతుకూ సులభంగా అందుబాటులోకి ఎరువులు • రైతుల ఇబ్బందులు లేకుండా యూరియా పంపిణీ • ముందుగా టోకెన్ ఇచ్చిన రైతులకు సమయానికి యూరియా అందుబాటులోకి రానుంది • వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

2



# విద్యలో ప్రపంచంతోనే పోటీ పడాలి

(మొదటి పేజీ తరువాయి)



గదుల్లో ఉందని బలంగా విశ్వసిస్తానని చెప్పారు. గురుపూజోత్సవం సందర్భంగా శిల్పకళా వేదికలో పెద్ద ఎత్తున నిర్వహించిన కార్యక్రమంలో ముఖ్యమంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా భారతరత్న డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. విద్యార్థినీ విద్యార్థులు ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్‌ను ప్రారంభించి స్టాల్స్ అన్నింటినీ పరిశీలించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ. "ప్రైవేటు పాఠశాలలకు ధీటుగా ప్రభుత్వ స్కూళ్లు రాణించాలి. ప్రైవేటు స్కూళ్లలో నర్సరీ, ఎల్ కేజీ, యూకేజీ మూడేళ్లు చదివిన తర్వాత పిల్లలు ప్రభుత్వ పాఠశాలలకు రావడం లేదు. అందుకే విద్యా కమిషన్ సూచనల మేరకు ప్రభుత్వ బడుల్లో కూడా నర్సరీ, ఎల్‌కేజీ, యూకేజీ ప్రారంభిస్తున్నాం ఈ ఏడాది 3 లక్షల మంది విద్యార్థినీ విద్యార్థులు ప్రైవేటు నుంచి ప్రభుత్వ పాఠశాలల్లో చేరడానికి వచ్చారంటే ఉపాధ్యాయుల కృషి మాత్రమే. అందుకు టీచర్లందరినీ అభినందిస్తున్నా. పిల్లలు బడికి పోవడానికి రవాణా సౌకర్యం లేకపోతే స్కూల్ టీచర్లు వారి జీతంలో కొంత కేటాయించి సామాజిక బాధ్యతగా ఆ డబ్బుతో పిల్లలకు రవాణా సౌకర్యం కల్పించిన ఉపాధ్యాయులకు ప్రత్యేక అభినందనలు. ఆదిలాబాద్ జిల్లాలో ఉపాధ్యాయులైన భార్య, భర్తలిద్దరూ కలిసి ఆదివాసీ పిల్లలకు చదువు చెబుతున్న తీరు అభినందనీయం. రాష్ట్రంలోని ఉపాధ్యాయులంతా ఆదరించి, అవకాశం ఇచ్చినందున విద్యా శాఖ నా వద్ద పెట్టుకుని తక్షణమే మీ బదిలీలు, ప్రమోషన్లు వంటి సుదీర్ఘ కాలం పెండింగ్‌లో ఉన్న సమస్యలను పరిష్కరించాం. కొంత ఆలస్యం జరిగి ఉండొచ్చు. కానీ వీలైనంత మేరకు అన్ని సమస్యలను పరిష్కరించడానికి ప్రయత్నిస్తున్నాంతెలంగాణ వస్తే కేజీ టు పీజీ ఉచిత నిర్బంధ విద్య అంటే తెలంగాణ బాగుపడుతుందని అందరూ భావించారు. కానీ అందుకు విరుద్ధంగా సింగిల్ టీచర్ పాఠశాలలు ఎన్ని మూత పడ్డాయో ఉపాధ్యాయులకు తెలుసు. ఉపాధ్యాయుల సమస్యలేవీ పరిష్కారం కాలేదు ప్రజా ప్రభుత్వం వచ్చాక 15 ఏళ్లుగా నిలిచిపోయిన ప్రమోషన్స్ కల్పించాం. బదిలీలు చేపట్టాం. కేవలం 55 రోజుల్లో టెట్ నిర్వహణతో సహా కేవలం 55 రోజుల్లో డీఎస్సీ నిర్వహించి 11 వేల మందికి టీచర్ ఉద్యోగాలిచ్చాం. అవగాహనతో కూడిన బాధ్యతాయుతమైన పౌరులుగా తీర్చిదిద్దాలని విద్యా రంగంపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాం విద్యార్థినీ విద్యార్థులకు డైట్, కాస్మొటిక్ చార్జీలు పెంచాం. ప్రైవేటు యూనివర్సిటీలు పెట్టుకుని విద్యపై ఆదిపత్యం చెలాయించాలన్న ప్రయత్నాలు జరిగాయి. వర్సిటీల్లో నియామకాలు ఆగిపోయాయి. ఇంటర్మీడియట్ విద్య పూర్తిగా నిర్లక్ష్యానికి గురైంది. నైపుణ్యం కలిగిన అధ్యాపకులు, ఉపాధ్యాయులు రిటైరైపోతుంటే కొత్త నియామకాలు చేపట్టలేదు. దేశానికి గొప్ప మేధావులను అందించిన ఉస్మానియా, కాకతీయ యూనివర్సిటీలు మూతపడే పరిస్థితికి చేరుకున్నాయితెలంగాణలో గతంలో గురుపూజోత్సవ కార్యక్రమాలు ఎప్పుడైనా జరిగాయా. తెలంగాణ పునర్నిర్మాణంలో ఉపాధ్యాయుల పాత్ర, వారి సేవల అవసరం ఉంటుందని మీతో మాట్లాడటానికి సమయం కేటాయించా. నేనూ గ్రామీణ పాఠశాలలోనే చదువుకున్నా. మీలాంటి వారు చదువు చెబితేనే ఈ స్థాయికి ఎదిగా. రాష్ట్రంలో 25 వేల ప్రభుత్వ పాఠశాలలు ఉంటే వాటిల్లో 24 లక్షల మంది విద్యార్థులున్నారు. 11 వేల ప్రైవేటు స్కూల్స్ ఉంటే వాటిల్లో 34 లక్షల మంది పిల్లలు చదువుతున్నారు. అందుకు కారణం పాలకులుగా మేము లేదా ఉపాధ్యాయులుగా మీరు. ప్రైవేటు స్కూళ్లను అవమానించడం కాదు. పోల్చి చెబుతున్నా. ప్రైవేటుకన్నా ప్రభుత్వ టీచర్లకు ఉన్నత విద్యార్హతలతో పాటు సామాజిక బాధ్యత గుర్తెరిగిన వారుంటారు. చదువు ఒక్కటే పేదల తలరాత మార్చుతుందని బలంగా నమ్ముతా. కొన్ని సంస్థల్లో అక్కడక్కడ ఫుడ్ పాయిజనింగ్ సంఘటనలు బాధ కలిగిస్తుంది. డైట్ చార్జీలను పెంచాం. నాణ్యమైన ఆహారం ఇవ్వాలని చెప్పాం. ఉపాధ్యాయులు కూడా వారితో కలిసి భోజనం చేయాలి. తల్లిదండ్రులు మనపై ఎంతో విశ్వాసంతో బడులకు పంపిస్తుంటారు. వారి నమ్మకమంతా టీచర్లపైనే. మీరెప్పుడైతే పిల్లలతో కలిసి భోజనం చేస్తారో తప్పులు జరక్కుండా ఉంటుంది. ప్రపంచ వ్యాప్తంగా అభివృద్ధి చెందిన సింగపూర్, చైనా, జపాన్, జర్మనీ లాంటి దేశాల్లో జరుగుతున్న విద్యా విధానం అధ్యయనం కోసం ప్రతి ఏటా 2 వందల మంది ఉపాధ్యాయులను ఆయా దేశాలకు పంపించాలని నిర్ణయించాం. రాష్ట్రంలో 1 లక్షా 20 వేల మంది ఉపాధ్యాయులు పనిచేస్తున్నారు. మారుతున్న కాలమాన పరిస్థితులకు అనుగుణంగా ఉపాధ్యాయులు కూడా నైపుణ్యం పెంచుకోవలసిన అవసరం ఉంది. ఫౌండేషన్ సరిగా లేకుండా భవనానికి పై అంతస్తులు కట్టాలని భావించడం సరికాదు. అందుకే నర్సరీ నుంచి 12 తరగతి వరకు విద్యా రంగంలో గట్టి ఫౌండేషన్ ఉండాలని భావిస్తున్నాం. నైపుణ్యం లేకుండా కేవలం సర్టిఫికేట్లతో సరిపోదు. రాష్ట్రంలో ప్రతి ఏటా 1.10 లక్షల విద్యార్థులు ఇంజనీరింగ్ పూర్తి చేస్తున్నారు. స్కిల్స్ లేని కారణంగా చాలామంది వెనుకబడి పోతున్నారుఅలాంటి విషయాలన్నింటిని దృష్టిలో పెట్టుకుని రాష్ట్రంలో వంద నియోజకవర్గాల్లో 20 వేల కోట్ల రూపాయలు వెచ్చించి ప్రపంచంలోనే అత్యున్నత ప్రమాణాలతో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ ప్రారంభిస్తున్నాం. అలాగే నైపుణ్యత కోసం మహీంద్రా గ్రూప్ చైర్మన్ ఆనంద్ మహీంద్రా చైర్మన్ గా యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీని ప్రారంభించాం రాష్ట్రంలోని 65 ప్రభుత్వ ఐటీఐల్లో పాత సిలబస్‌తో అవి కాలగర్భంలో కలిసిపోయే పరిస్థితులొస్తే టాటా కన్సల్టెన్సీ వారి సహకారంతో 2400 కోట్ల రూపాయలు వెచ్చించి అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్లు మార్చుతున్నాం. ప్రపంచంలోని అత్యధిక జనాభా కలిగిన దేశం ఒలింపిక్స్‌లో ఒక్క మెడల్ కూడా సాధించలేకపోవడం మనకు అవమానకరం. దేశ ప్రతిష్ట పెరగడానికి తెలంగాణలో స్పోర్ట్ వర్సిటీ, స్పోర్ట్స్ అకాడమీ ఉండాలని నిర్ణయించాం. మీ స్కూళ్లల్లో నైపుణ్యం ఉన్న క్రీడాకారులను గుర్తించండి. వారిలోని ప్రతిభను వెలికితీయడానికి పిల్లలను నిశితంగా గమనించండి. అందుకు ఏది అడిగినా చేయడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందికొందరు పిల్లలు మాదక ద్రవ్యాల వ్యసనాల బారిన పడుతున్నారు. తద్వారా జీవితంలో దారి తప్పుతున్నారు. అలాంటి వారిని చూస్తే తల్లిదండ్రులు ఎంత వ్యధ చెందుతారో అర్థం చేసుకోండి. రాష్ట్రంలో ఒక చిన్న గంజాయి మొక్క కనబడినా కఠినంగా చర్యలు తీసుకుంటాం..." అని హెచ్చరించారు.

## ఖైరతాబాద్ బడా గణేశ్ దర్శించిన సీఎం

హైదరాబాద్, సెప్టెంబర్ 5-(తొలి క్రాంతి):

ఖైరతాబాద్ శ్రీ విశ్వశాంతి మహా గణపతి మహదేవుడిని దర్శించుకుని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆ విఘ్నేశ్వరుడి కృప ప్రజలందరిపైనా ఉండాలని ప్రార్థించారు. హైదరాబాద్ నగర చరిత్రలో గడిచిన 71 సంవత్సరాలుగా ఎన్ని ఇబ్బందులు, కష్టాలొచ్చినా దేశంలోనే అత్యంత ప్రతిష్టాత్మకంగా ఖైరతాబాద్ బడా గణేష్ ఉత్సవాలను జరుపుతున్నారని ఈ సందర్భంగా ముఖ్యమంత్రి నిర్వాహకులను అభినందించారు. ఇలాంటి కార్యక్రమాలను ఒకసారి చేయడమే కష్టమవుతున్న ఈ కాలంలో ఎన్ని ఉపద్రవాలొచ్చినా తట్టుకుని నిలబడి నిర్వహిస్తున్న ఖైరతాబాద్ గణపతికి పోటీ లేదన్నారు. హైదరాబాద్‌లో 1 లక్షా 40 వేల విగ్రహాలను ప్రతిష్టించుకుని ఉత్సవాలను అత్యంత వైభవంగా జరుపుకుంటున్నామని చెప్పారు. దేశంలో ఎక్కడా లేని విధంగా గణేష్ మండపాలకు ఉచిత విద్యుత్‌ను అందిస్తున్నామని చెప్పారు. భక్తుల మనోభావాలను గౌరవించే విధంగా నగరంలో పోలీసు, మున్సిపల్, రెవెన్యూ, విద్యుత్, ఇతర శాఖలు తోడ్పాటును అందిస్తున్నాయని చెప్పారు. అన్ని మతాలను గౌరవిస్తూ హైదరాబాద్ నగరం మత సామరస్యానికి ప్రతీకగా నిలుస్తోందన్నారు. ప్రజలకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా ట్యాంక్‌బండ్‌తో పాటు ఇతర ప్రాంతాల్లో ప్రభుత్వం ఏర్పాట్లు చేసిందని, ప్రజలంతా భక్తి శ్రద్ధలతో నిమజ్జన కార్యక్రమం పూర్తి చేసుకోవాలని పిలుపునిచ్చారు.

# ఉప ఎన్నికలు రాబోతున్నాయ్

(మొదటి పేజీ తరువాయి)



ఇచ్చిన హామీలను అమలు చేయడంలోనూ, గతంలో ఉన్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేయడంలోనూ ప్రస్తుత ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఎద్దేవా చేశారు. దీనికి బాధ్యత వహిస్తూ ముఖ్యమంత్రి ప్రజలకు క్షమాపణ చెప్పాలని, తమకు పరిపాలన చేతకావడం లేదని, అన్ని కార్యక్రమాలను అమలు చేయలేమని నేరుగా చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన కేవలం 21నెలల్లోనే ప్రజల నుంచి సంపూర్ణ వ్యతిరేకతను మూటగట్టుకుందని కేటీఆర్ విమర్శించారు. హామీల వైఫల్యం, నమ్మకద్రోహం ఒక కారణం అయితే, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మాటల తీరు, వ్యవహార శైలి మరో ప్రధాన కారణమని ఆయన పేర్కొన్నారు. సీఎం రేవంత్ రెడ్డి పరిపాలనపై దృష్టి పెట్టకుండా ప్రతిక్షణం కేసీఆర్ పేరు తలుచుకుంటూ అడ్డగోలు మాటలు మాట్లాడుతున్నారని ఆరోపించారు. ప్రభుత్వాన్ని నడపడం చేతగాక, గత ప్రభుత్వం అప్పులు చేసిందని కాంగ్రెస్ అబద్ధాలు చెబుతోందని కేటీఆర్ మండిపడ్డారు. గత ప్రభుత్వం కేవలం రూ. 2.80 లక్షల కోట్ల అప్పు మాత్రమే చేసిందని పార్లమెంట్ సాక్షిగా కేంద్ర ప్రభుత్వం స్పష్టం చేసిందని ఆయన తెలిపారు. అయితే, ఈ 21 నెలల కాలంలోనే రేవంత్ రెడ్డి ప్రభుత్వం రూ. 2.20 లక్షల కోట్ల పైగా అప్పులు చేసిందని, ఆ అప్పుతో ఏ ఒక్క సంక్షేమ పథకం లేదా అభివృద్ధి కార్యక్రమం చేపట్టలేదని విమర్శించారు. గత ప్రభుత్వం సంవత్సరానికి రూ. 20 వేల కోట్ల అప్పు చేస్తే, ఈ ప్రభుత్వం నెలకు రూ. 20 వేల కోట్ల అప్పు చేస్తోందని ఆరోపించారు. యూరియా సంక్షోభంపై రాష్ట్ర ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరు అనుమానాలకు దారితీస్తోందని కేటీఆర్ అన్నారు. పంటల కొనుగోళ్లకు, ఆ తర్వాత వాటికి ఇవ్వాల్సిన బోనస్‌ను ఎగగొట్టాలనే ఉద్దేశంతోనే కాంగ్రెస్ ప్రభుత్వం కావాలనే యూరియా సరఫరా చేయడం లేదని ప్రజలు భావిస్తున్నారని ఆయన తెలిపారు. వ్యవసాయ రంగం, రైతుల పట్ల కాంగ్రెస్ ప్రభుత్వానికి ఇంత దుర్మార్గమైన ఆలోచన ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణ రాష్ట్రంలో జరిగిన ఫిరాయింపులపై సుప్రీంకోర్టు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చిందని, త్వరలో రాష్ట్రంలో ఉప ఎన్నికలు రావడం ఖాయమని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. స్పీకర్ లేదా ఫిరాయింపుదారులు ఎన్ని ప్రయత్నాలు చేసినా రాబోయే ఆరు నెలల కాలంలో ఉప ఎన్నికలు వస్తాయని ఆయన అన్నారు. ఈ ఎన్నికల్లో బాన్సువాడలో పోచారం శ్రీనివాస్ రెడ్డి ఓడిపోవడం ఖాయమని జోస్యం చెప్పారు. గడువులోగా స్పీకర్ నిర్ణయం తీసుకోకపోతే మరోసారి సుప్రీంకోర్టుకు వెళ్తామని కేటీఆర్ హెచ్చరించారు. పోచారం ఎమ్మెల్యే పదవి కూడా పోయే వరకు న్యాయపోరాటం కొనసాగిస్తామని ఆయన స్పష్టం చేశారు. సుదీర్ఘ రాజకీయ జీవితం తర్వాత పోచారం శ్రీనివాస్ రెడ్డి ఏ పార్టీలో ఉన్నాడో చెప్పుకోలేని దయనీయమైన స్థితిలో ఉన్నారని, కానీ బీఆర్ఎస్‌లో ఉన్న ప్రతి కార్యకర్త గర్వంగా తెలంగాణ తెచ్చిన పార్టీలో ఉన్నామని చెప్పుకోవచ్చని కేటీఆర్ అన్నారు.

# రైతుల ప్రయోజనాలు దెబ్బతినే రాజకీయాలు చేయకూడదు

(మొదటి పేజీ తరువాయి)

పనిచేయడంపై దృష్టి పెట్టకుండా గూగుల్ ప్రచారంపై ఎక్కువ శ్రద్ధ చూపడం దురదృష్టకరమని వ్యాఖ్యానించారు. హరీశ్ రావు మాట్లాడుతూ కేసీఆర్ నాయకత్వంలో తెలంగాణ అనేక అద్భుతాలు సాధించిందని, ఒకప్పుడు "బెంగాల్ ఆచరిస్తుంది దేశం అనుసరిస్తుంది" అని ఉండే నానుడి, ఇప్పుడు "తెలంగాణ ఆచరిస్తుంది దేశం అనుసరిస్తుంది"గా మారిందని పేర్కొన్నారు. గత పదేళ్లలో తలసరి ఆదాయం, విద్యుత్ వినియోగం, జీఎస్‌డీపీ వృద్ధి రేటులో తెలంగాణ దేశంలో అగ్రగామిగా నిలిచిందని గుర్తుచేశారు. హైదరాబాద్‌లో పవర్ హాలిడేస్ ఇచ్చే రోజులు ముగిశాయని, గ్రామీణ ప్రాంతాల్లో గంటల కొద్దీ పవర్‌కట్ ఉండే పరిస్థితి కేవలం ఒకే ఏడాదిలో కేసీఆర్ 24 గంటల నాణ్యమైన విద్యుత్ అందించి మార్చేశారని చెప్పారు. మిషన్ భగీరథ ద్వారా ప్రతి ఇంటికి స్వచ్ఛమైన తాగునీటిని అందించడం, మిషన్ కాకతీయ ద్వారా 30 వేల చెరువులను పునరుద్ధరించడం, రైతుల కోసం నేరుగా నగదు బదిలీ చేసిన రైతుబంధు వంటి పథకాలను హరీశ్ రావు ప్రస్తావించారు. రైతుబంధు పథకం రైతుల గౌరవాన్ని పెంచిందని, ఒకప్పుడు వ్యవసాయం చిన్నచూపు అయ్యిందని, కానీ కేసీఆర్ పాలనలో రైతులు గర్వంగా నిలిచారని అన్నారు. కేంద్రం కూడా తెలంగాణ పథకాలను ఆదర్శంగా తీసుకుని 'హర్ ఘర్ జల్', 'పీఎం కిసాన్', 'అమృత సరోవర్' వంటి కార్యక్రమాలు ప్రారంభించిందని గుర్తు చేశారు. అలాగే గ్రీన్ కవర్‌ను 7.7 శాతం పెంచి దేశంలో నంబర్ వన్‌గా నిలిపిన రాష్ట్రం తెలంగాణ అని చెప్పారు. ఆరోగ్య రంగంలో మాతా-శిశు మరణాల రేటును తగ్గించి దేశంలో మూడో స్థానంలో నిలిచామని, బీఆర్ఎస్ అధికారంలో ఉండి ఉంటే ఇప్పటికి నంబర్ వన్ అయ్యేవాళ్లమని వ్యాఖ్యానించారు. పంచాయతీ సెక్రటరీలకు ఒకేసారి 10 వేల ఉద్యోగాలు ఇచ్చి, పల్లె స్థాయిలో అభివృద్ధికి నిధులు కేటాయించామని అన్నారు. దీనిపై అవాస్తవ దుష్ప్రచారం జరుగుతోందని, వాస్తవానికి ఇది 37 లక్షల ఎకరాలకు సాగునీరు అందించే ప్రాజెక్టు అని వివరించారు. మల్లన్నసాగర్ నుంచి మూసీకి నీళ్లు తీసుకెళ్తామని చెప్పిన ప్రస్తుత సీఎం రేవంత్ రెడ్డి, కాళేశ్వరం లేకుండా అది ఎలా సాధ్యమని ప్రశ్నించారు. కాంగ్రెస్ హయాంలోనే కూలిపోయిన ప్రాజెక్టులు ఉన్నప్పుడు, మూడు పిల్లర్లు కుంగిన కారణంగా లక్ష కోట్లు నష్టపోయామని ప్రచారం చేయడం సరైంది కాదని విమర్శించారు. మూడు నాలుగు వందల కోట్లతోనే రిపేర్ పనులు పూర్తవుతాయని చెప్పారు. కేసీఆర్ అంకితభావంతో ప్రతి ఉదయం విద్యుత్ సమీక్ష చేసి, తర్వాత మిషన్ భగీరథ ప్రోగ్రెస్ చూశేవారు. అందుకే తెలంగాణ అన్ని రంగాల్లో వేగంగా అభివృద్ధి చెందింది. ఇప్పుడు పాలకులే నెగెటివ్ మైండ్‌సెట్‌తో ఉంటే అభివృద్ధి ఎలా సాధ్యం అవుతుంది?" అని ప్రశ్నించారు. కొన్ని తప్పులు జరిగినా వాటిని సరిదిద్దుకుంటూ ముందుకు వెళ్లామని, కానీ ప్రస్తుత ప్రభుత్వం ప్రజల సమస్యల కంటే ప్రచారానికే ఎక్కువ ప్రాధాన్యత ఇస్తోందన్నారు.





# నారాయణఖేడ్ అభివృద్ధికి పునాది

- పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన
- వైద్య రంగాన్ని కార్పొరేట్ స్థాయిలోకి తీసుకెళ్తామన్న మంత్రి దామోదర్ రాజనర్సింహ

హైదరాబాద్, సెప్టెంబర్ 5-(తొలి క్రాంతి):

శుక్రవారం నారాయణఖేడ్‌లో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన జరిగింది. జూకల్‌లోని కన్వెన్షన్ హాల్ విస్తరణ (రూ. 1.15 కోట్లు), అర్బన్ ఫారెస్ట్ పార్క్‌లో ఎకో టూరిజం పనులు (రూ. 3.9 కోట్లు), నారాయణఖేడ్ రింగ్ రోడ్, సిర్గాపూర్ కొత్త పీహెచ్‌సీ (రూ. 1.56 కోట్లు), బోరంచలో కొత్త ఆసుపత్రి, మనూరు-ఎల్గోయి బిటి రోడ్ (రూ. 6కోట్లు) వంటి అభివృద్ధి పనులు ప్రారంభమయ్యాయి. వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ మాట్లాడుతూ నారాయణఖేడ్ అభివృద్ధి కోసం ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు. రాష్ట్రంలో వైద్య రంగాన్ని కార్పొరేట్ స్థాయిలో అభివృద్ధి చేస్తున్నామని, 9 వేల పోస్టులు భర్తీ చేశామని, త్వరలో మరో 8 వేల పోస్టులు భర్తీ చేయనున్నట్లు చెప్పారు. ప్రతి జిల్లాలో డెకార్ క్యాన్సర్ సెంటర్లు, గ్రామాల వరకు మొబైల్ క్యాన్సర్ స్కానింగ్ వాహనాలు ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. హైవేల వెంట ప్రతి 30 కిలోమీటర్లకు ట్రామా కేర్ సెంటర్లు, అంబులెన్సులు ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. ఎమ్మెల్యే డాక్టర్ సంజీవరెడ్డి మాట్లాడుతూ నల్లవాగు ప్రాజెక్టు, కమలాపూర్, బోరంచ వంటి టూరిజం ప్రాజెక్టులకు 5 కోట్లు కేటాయిస్తే పూర్తి అవుతాయని తెలిపారు. సిర్గాపూర్ పీహెచ్‌సీకి అదనంగా 30 లక్షలు మంజూరు చేసి కాంపౌండ్ వాల్, 30 పడకల ఆసుపత్రి ఏర్పాటు చేయాలని కోరారు. ఎంపీ సురేష్ కుమార్ షెట్కర్ మాట్లాడుతూ నారాయణఖేడ్ ప్రాంత అభివృద్ధికి మరింత నిధులు అవసరమని, గత పాలకుల నిర్లక్ష్యం వల్ల పదేళ్లలో అభివృద్ధి జరగలేదని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ చంద్రశేఖర్, సబ్ కలెక్టర్ ఉమా హారతి, కాంగ్రెస్ నాయకులు పట్లోళ్ల చంద్రశేఖర్ రెడ్డి, సుధాకర్ రెడ్డి, స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

# నవరాత్రికి డబుల్ ధమాకా

- రాత్రికి రాత్రే వచ్చిన నిర్ణయం కాదు!
- ట్రంప్, బిహార్ ఎన్నికలు, ప్రతిపక్షాల ఒత్తిడి శుద్ధ అబద్ధాలే
- జీఎస్టీ సంస్కరణలపై కేంద్రమంత్రి నిర్మలా సీతారామన్
- 18 నెలల క్రితమే కమిటీ..140 కోట్ల మందికి ప్రయోజనం..



న్యూఢిల్లీ, సెప్టెంబర్5-(తొలి క్రాంతి):

జీఎస్టీ శ్లాబుల రద్దు, తగ్గింపు నిర్ణయం రాత్రికి రాత్రి వచ్చిందేం కాదని, ఇందుకు అనేక సుదీర్ఘ మంతనాలు, ప్రయత్నాలు, గణాంకాల లెక్కలను తేల్చామని ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ అన్నారు. 18 నెలల క్రితమే జీఎస్టీ తగ్గింపునకు మంత్రుల బృందం (కమిటీ) ఏర్పడిందన్నారు. ఈ కమిటీ నిరంతరం చర్యలు తీసుకుందన్నారు. 300కు పై విషయాలను ఇందులో చర్చించామన్నారు. ఒక్కరోజు నిర్ణయం కాదన్నారు. శుక్రవారం జీఎస్టీ శ్లాబుల రద్దు, తగ్గింపుపై ఆమె మీడియాతో మాట్లాడారు. ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలో దేశంలోని ప్రతీ ఒక్కరికీ సంక్షేమ ఫలాలు అందాలన్నదే తమ లక్ష్యమన్నారు. ట్రంప్ సుంకాల వల్లే జీఎస్టీలో మార్పులు చేశారన్న ఆరోపణలు శుద్ధ అవాస్తవమన్నారు. సమయానుసారం అండర్ గ్రౌండ్ పని జరుగుతుందన్నారు. ప్రజలకు గరిష్ఠ ప్రయోజనాలు అందించాలన్నదే తమ అభిమతమన్నారు. ఇందుకోసం అనేక సమాలోచనలు చేశామని, సమావేశాలు జరిగాయని వివరించారు. ప్రతీ అంశాన్ని క్షుణ్ణంగా చర్చించాకే నిర్ణయం తీసుకున్నామని చెప్పారు. రాత్రికి రాత్రే వచ్చిన నిర్ణయం అన్న వాదనలో ఏ మాత్రం వాస్తవం లేదన్నారు. ద్రవ్యోల్బణాన్ని అదుపులో ఉంచడానికి ప్రభుత్వం ఎల్లప్పుడూ చర్యలు తీసుకుంటుందని చెప్పారు. సరఫరా సంబంధిత సమస్యల కారణంగా చాలాసార్లు ద్రవ్యోల్బణం నియంత్రణలో ఉండదని, ఇందుకు అనేక చర్యలను తీసుకోవాల్సి ఉంటుందన్నారు. పన్నులు, ప్రజలపై భారం తగ్గించడం కోసం అనేక ప్రయత్నాలు చేశామన్నారు. ప్రతీ అంశాన్ని చర్చించామని, గణాంకాలను ఔపోసన పట్టామన్నారు. బిహార్ ఎన్నికలను కూడా కొందరూ ఉదహరిస్తున్నారని అన్నారు. భారత్ లో దసరా, దీపావళి అత్యంత పెద్ద పండుగలన్నారు. మోదీ ప్రభుత్వం ఈ పండుగలకు ముందు దేశవాసులకు ప్రయోజనం కల్పించాలని కృతనిశ్చయంతో పనిచేస్తుందన్నారు. ఈ సంస్కరణలు కేవలం బిహార్ కే కాదు యావత్ భారత్ కు 'డబుల్ ధమాకా'ను అందించాయన్నారు. బిహార్ మ్యానిఫెస్టో కాదని, 140 కోట్ల మందికి మేలు చేకూర్చే మ్యానిఫెస్టో అని అన్నారు. జీఎస్టీలో మార్పు కోసం నిరంతరం పరిశ్రమ వర్గాలతో చర్చించామన్నారు. ధరల తగ్గింపుపై కూడా సుదీర్ఘ చర్చలే జరిగాయన్నారు. సంస్థలు ఏదో ఒక రకంగా డబ్బు సంపాదించినా, సామాన్యునికి ప్రయోజనం ఏ దిశలో దక్కుతుందని ఆలోచించామని ఈ నేపథ్యంలో అందరికీ ఆమోదయోగ్యమైన, ప్రయోజనం చేకూర్చే విధానాన్ని అనుసరించామన్నారు. జీఎస్టీ తగ్గింపు కారణంగా నవరాత్రికి దేశ ప్రజలు స్వదేశీ ఉత్పత్తులను మరిన్ని కొనుగోలు చేస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. ఒకప్పుడు జీఎస్టీని 'గబ్బర్ సింగ్ ట్యాక్స్' అని ఎగతాళి చేసిన వారికి తమ తగ్గింపు, శ్లాబుల రద్దు నిర్ణయం చెంపపెట్టుగా అభివర్ణించారు. 2.0 సంస్కరణలను తమ ఖాతాల్లోకి వేసుకోవాలని దుష్ట ప్రయత్నాలను కూడా మొదలు పెట్టారని అన్నారు. చివరగా రాత్రికి రాత్రే, ఎవరి ఒత్తిడితోనో, ప్రతిపక్షాలకు భయపడో తీసుకున్న నిర్ణయం కాదని, దేశంలో ప్రతీ ఒక్కరికీ మేలు చేకూరాలని నరేంద్ర మోదీ ప్రభుత్వం బలంగా సంకల్పించిందని కేంద్రమంత్రి నిర్మలా సీతారామన్ స్పష్టం చేశారు.



# విద్యపై భారీ పెట్టుబడులు

(మొదటి పేజీ తరువాయి)

ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ ప్రారంభిస్తున్నామని వెల్లడించారు. కళాశాల విద్యను పూర్తి చేసుకుని బయటకు వెళ్లగానే విద్యార్థులు ఉద్యోగాలు పొందే విధంగా స్కిల్ యూనివర్సిటీలో సిలబస్ రూపొందించి అమలు చేస్తున్నట్టు చెప్పారు. పారిశ్రామిక వేత్తలతో చర్చించి ఆ సిలబస్ రూపొందిస్తామన్నారు. అంతేకాకుండా, రాష్ట్రంలోని ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు ఐఎస్‌బీలో ఐదు రోజుల పాటు ప్రత్యేక శిక్షణ కార్యక్రమం రూపొందించి అమలు చేయాలని నిర్వాహకులను భట్టి విక్రమార్క కోరారు.

# రైతులపై పోలీసుల వేధింపులు సహించం

(మొదటి పేజీ తరువాయి)

బెదిరింపులా?" అని నిలదీశారు. కాంగ్రెస్ నాయకుడు ఫిర్యాదు చేయడమే ఆలస్యం అన్నట్టుగా పోలీసులు చట్టవ్యతిరేక చర్యలకు దిగుతున్నారని విమర్శించారు. పాలకుల మెప్పుకోసం పోలీసులు ప్రజలను ఇబ్బంది పెడితే మూల్యం చెల్లించుకోక తప్పదు అని హెచ్చరించిన ఆమె, ఇలాంటి దారుణాలను ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోమని స్పష్టం చేశారు. ఇందుకు సంబంధించిన వీడియోను ఆమె షేర్ చేస్తూ, "కాంగ్రెస్ ప్రభుత్వం దుర్మార్గమిది" అంటూ మండిపడ్డారు.

# రైతు వేదికల్లో యూరియా సేల్ కౌంటర్లు

హైదరాబాద్, సెప్టెంబర్ 5-(తొలి క్రాంతి):

వానాకాలం సాగు విస్తారంగా సాగుతున్న నేపథ్యంలో రైతులు యూరియా ఎరువుల కొరతను ఎదుర్కొంటున్నారని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వెల్లడించారు. ఈ సమస్యను ఢిల్లీ పర్యటనలో భాగంగా కేంద్ర మంత్రులు, ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. యూరియా అవసరాన్ని వివరించడంతో కేంద్ర ప్రభుత్వం వెంటనే స్పందించి తూర్పు తీరంలోని వివిధ నౌకాశ్రయాలకు రానున్న నాలుగు దిగుమతి నౌకల నుంచి రాష్ట్రానికి అవసరమైన యూరియా కేటాయించేందుకు అంగీకరించిందన్నారు. అంతేకాకుండా దేశీయ తయారీ యూనిట్ల నుంచి కూడా అదనంగా 30,000 మెట్రిక్ టన్నుల యూరియాను రాష్ట్రానికి కేటాయించడానికి కేంద్రం అంగీకరించినట్లు తెలిపారు. రామగుండం ఆర్‌ఎఫ్‌సిఎల్ ఎరువుల కర్మాగారం నిలిచిపోయిన కారణంగా రాష్ట్ర రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను కూడా కేంద్ర మంత్రుల దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. వెంటనే ఉత్పత్తి ఆరంభించేలా చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేయగా, వచ్చే 3-4 రోజుల్లో యూనిట్ తిరిగి కార్యకలాపాలు ప్రారంభించేలా తక్షణ చర్యలు తీసుకుంటామని కేంద్ర ప్రభుత్వం హామీ ఇచ్చిందని తెలిపారు. ఈ పరిణామాలతో రాష్ట్రంలో ఎరువుల లభ్యత మరింత మెరుగుపడుతుందని మంత్రి స్పష్టం చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా యూరియా సరఫరా పెరుగుతున్న నేపథ్యంలో రైతు వేదికల వద్ద అదనపు యూరియా సేల్ కౌంటర్లను ఏర్పాటు చేయాలని అధికారులను మంత్రి ఆదేశించారు. ఇప్పటికే కొన్ని చోట్ల ప్రయోగాత్మకంగా చేపట్టిన పంపిణీ విధానం సత్ఫలితాలు ఇచ్చినందున రాష్ట్ర వ్యాప్తంగా ఈ విధానాన్ని అమలు చేయాలని నిర్ణయించామని చెప్పారు. మండలానికి ఒకటి నుంచి రెండు ఉన్న ప్రాంతాల్లో రైతు వేదికలను వాడుకొని విక్రయాలు చేపట్టాలని సూచించారు. గ్రామాల వారీగా, పాస్ పుస్తకాల ఆధారంగా ఒక రోజు ముందుగానే రైతులకు టోకెన్లు జారీ చేసి ఎరువులు అందించే విధంగా ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. ముందుగానే టోకెన్లు ఇవ్వడం వల్ల రైతులు ఇబ్బందులు లేకుండా యూరియా పొందగలుగుతున్నారని తెలిపారు. పంపిణీ ప్రక్రియలో ఎక్కడా అవకతవకలు జరగకుండా పకడ్బందీ చర్యలు తీసుకోవాలని ఇప్పటికే ఆదేశాలు జారీ చేసినట్లు మంత్రి తెలిపారు. కోఆపరేటివ్, మార్క్‌ఫెడ్ అధికారులతో సమన్వయం చేసుకొని అవసరమైన ఏర్పాట్లు చేయాలని సూచించామని, పోలీస్, విజిలెన్స్ విభాగాలతో కూడిన పర్యవేక్షణలో ఎక్కడా బ్లాక్ మార్కెటింగ్ జరగకుండా చర్యలు తీసుకుంటున్నామని స్పష్టం చేశారు.

# ధరణి కాళేశ్వరం పేరుతో వనరుల దోపిడీ

- బీఆర్ఎస్ రాజీనామా వెనక అసలైన కారణం కవిత లిక్కర్ కేసే
- ఆస్తుల పంచాయతీ ప్రజలకు సంబంధం లేదు
- పత్రికలు కూడా పట్టించుకోవాల్సిన అవసరం లేదు
- స్టేషన్ ఘన్పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి

హైదరాబాద్, సెప్టెంబర్ 5-(తొలి క్రాంతి):

స్టేషన్ ఘన్పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి సంచలన వ్యాఖ్యలు చేశారు. ఆయన బీఆర్ఎస్ పార్టీకి ఎందుకు రాజీనామా చేయాల్సి వచ్చిందో మొదటిసారి మీడియా ఎదుట స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి కుమార్తె కవిత లిక్కర్ కేసులో ఇన్వాల్వ్ కావడం తన రాజీనామాకు ప్రధాన కారణమని చెప్పారు. ఒక ముఖ్యమంత్రి బిడ్డ లిక్కర్ కేసులో విచారణ ఎదుర్కోవడం సరైన పద్ధతి కాదని, అనేక రోజులు జైలులో ఉండడం కూడా బాధ కలిగించిందని తెలిపారు. ఈ పరిణామాలు తాను బీఆర్ఎస్ నుంచి బయటకు రావడానికి దారి తీశాయని పేర్కొన్నారు. కవితపై వచ్చిన ఆరోపణల విషయానికి వస్తే అవి కుటుంబ ఆస్తి తగాదాలకు సంబంధించినవేనని ఆయన వ్యాఖ్యానించారు. కల్వకుంట్ల కుటుంబం గత పదేళ్లలో అధికారాన్ని అడ్డం పెట్టుకుని తెలంగాణ వనరులను దోచుకుందని ఆరోపించారు. ధరణి వ్యవస్థను వినియోగించి వేల ఎకరాల భూములు కబ్జా చేశారని, కాళేశ్వరం పేరుతో వేల కోట్లు సంపాదించుకున్నారని విమర్శించారు. ఇప్పుడు ఆస్తుల పంచాయతీ, కోట్ల రూపాయల పంచాయతీ కారణంగా వారి కుటుంబంలో గొడవలు బయటకు వస్తున్నాయని అన్నారు. ఈ గొడవతో తెలంగాణకు, ప్రజలకు, కాంగ్రెస్ పార్టీకి ఎలాంటి సంబంధం లేదని కడియం శ్రీహరి స్పష్టం చేశారు. ఇది అవినీతి ద్వారా సంపాదించిన డబ్బును పంచుకోవడం కోసం జరుగుతున్న పంచాయతీ తప్ప ప్రజలకు ఉపయోగపడే విషయం కాదని, అందువల్ల పత్రికలు కూడా పట్టించుకోవాల్సిన అవసరం లేదని సూచించారు. కల్వకుంట్ల కుటుంబం ప్రజల విశ్వాసాన్ని కోల్పోయిందని, అందుకే తెలంగాణ ప్రజలు వారిని పక్కన పెట్టారని ఆయన వ్యాఖ్యానించారు.

## "కొత్తగూడెంలో డైరెక్టర్ పరిశీలన"



**కొత్తగూడెం, సెప్టెంబర్ 05 తొలి క్రాంతి:**
కొత్తగూడెం ఏరియాలోని ఆర్.సి.హెచ్.పి ని డైరెక్టర్ (ప్లానింగ్ ప్రాజెక్ట్స్) కొప్పుల వెంకటేశ్వర్లు సందర్శించారు. రైలు మార్గం ద్వారా బొగ్గు రవాణా ఏర్పాట్లపై ఆర్.సి.హెచ్.పి ఎస్ఈ (ఈ ఎం) షైక్ కరీముల్లా నుండి వివరాలు తెలుసుకున్నారు. త్వరలో ప్రారంభమయ్యే వికే కోల్ మైన్ డిస్పాచ్ సిద్ధతలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఏరియా జీఎం ఎం. షాలేం రాజు ఉత్పత్తి, డిస్పాచ్ వివరాలను తెలియజేశారు. పలు అధికారులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

## దొడ్డా రమేష్ మండల అధ్యక్షుడు

- దమ్మపేట మండల పార్టీ బలపరిచే లక్ష్యం
- స్థానిక నాయకులతో సమన్వయం, బాధ్యతలు స్వీకారం



**దమ్మపేట, సెప్టెంబర్ 05 తొలి క్రాంతి:**
పార్టీ వ్యవస్థాగత నిర్మాణాన్ని బలపరచడం లక్ష్యంగా, మాజీ మంత్రివర్యులు, పార్టీ కార్యనివాహక అధ్యక్షుల ఆదేశాల మేరకు జిల్లా అధ్యక్షులుగా "రేగా" బాధ్యతలు స్వీకరించిన తరువాత అశ్వారావుపేట నియోజకవర్గ ఇంచార్జ్, మాజీ ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరావు సిఫార్సుతో దొడ్డా రమేష్ దమ్మపేట మండల అధ్యక్షుడిగా నియమించబడ్డారు. మండల బాద్యులుగా బాధ్యతలు చేపట్టిన దొడ్డా రమేష్ వెంటనే స్థానిక నాయకులు, కార్యకర్తలతో సమన్వయం సాధించి పార్టీ అభివృద్ధికి కంకణబద్దులై పనిచేయనున్నారు. జిల్లా పార్టీ తరపున వారికి హృదయపూర్వక అభినందనలు తెలియజేయడం జరిగింది. అలాగే మండల బిఆర్ఎస్ శ్రేణులు శుభాకాంక్షలు అందజేశారు.

## గణేష్ నవరాత్రి ఉత్సవాల్లో అన్నదానం



**పాల్వంచ, సెప్టెంబర్ 05 తొలి క్రాంతి:**
గణేష్ నవరాత్రి ఉత్సవాల సందర్భంగా పాల్వంచలోని వివిధ ప్రదేశాల్లో ఘనంగా అన్నదానం కార్యక్రమాలు నిర్వహించబడ్డాయి. నవభారత్ గాంధీ నగర్, జగ్గు తండా, పాత పాల్వంచ, కేశవాపురం లో జరిగిన కార్యక్రమాల్లో రాష్ట్ర మార్క్ ఫెడ్ మాజీ డైరెక్టర్, డి సి ఎం ఎస్ మాజీ చైర్మన్, పాల్వంచ సొసైటీ అధ్యక్షులు కొత్వాల శ్రీనివాసరావు పాల్గొన్నారు. కార్యక్రమాల్లో కాంగ్రెస్ నాయకులు ఎర్రం శెట్టి ముత్తయ్య, కొండం వెంకన్న, వై వెంకటేశ్వరరావు, పైడిపల్లి మహేష్, మాలోత్ కోటి నాయక్, బానోతు బాలు నాయక్, దేవి, గంధం నరసింహారావు, అల్లం సత్యనారాయణ, గంధం సతీష్, జగ్గు తండా బాలు తదితరులు హాజరయ్యారు.

## కాంట్రాక్టు కార్మికుల హక్కుల కోసం సెప్టెంబర్ 12 చలో ప్రజా భవన్


**భద్రాద్రి కొత్తగూడెం, సెప్టెంబర్ 05 తొలి క్రాంతి:**
సింగరేణి కాంట్రాక్టు కార్మికులు ప్రభుత్వానికి, యాజమాన్యానికి హెచ్చరిక. 36,000 మంది కార్మికుల సమస్యలు వెంటనే పరిష్కరించాలని, కనీస వేతనం 26,000 రూపాయలు అమలు చేయాలని, లాభాల్లో భాగస్వామ్యంగా 20,000 రూపాయల బోనస్ చేయాలని డిమాండ్ చేశారు. సింగరేణి కాంట్రాక్టు కార్మిక సంఘాల ఐక్య కమిటీ నేతల పిలుపుతో సెప్టెంబర్ 12న ప్రజా భవన్ చేరాలని అన్నారు. కార్మికులు ఉదయం నుండి సాయంత్రం వరకు విస్తృత ప్రచారం చేశారు. జేపీసీ నాయకులు కె బ్రహ్మచారి, గుడెల్లి యాకయ్య, భూక్యా రమేష్, భాస్కర్, విజయ్ గూగులోత్ సక్రాం తదితరులు మాట్లాడుతూ, సింగరేణి అభివృద్ధి కార్మికుల శ్రమ వల్లనే సాధ్యమవుతుందని, ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని చట్టపరంగా ఎదుర్కోవాలని హెచ్చరించారు.



# చట్టాలకు సవాల్



- వాగుల్లో మాఫియా మోత
- అధికారుల మౌనం, ప్రజల మొర
- రాజకీయ ముసుగులో దందా






**అశ్వరావుపేట, సెప్టెంబర్ 05 తొలి క్రాంతి:**
సెలవు దొరికిందంటే చాలు, వాగుల్లో ఇసుక మాఫియా గూటి కదుతున్నట్టుగా దృశ్యాలు గాండ్లగూడం పెదవాగు బ్రిడ్జి వద్ద తెల్లవారుజామునే కనబడుతున్నాయి. వరుసలుగా ట్రాక్టర్లు ఇసుకను ఎత్తుకెళ్తూ, చట్టాలను గాలిలో కలిపేస్తూ దందా దారులు హాయిగా తిరుగుతున్నారు. అనుమతు లు లేకుండా, ఎవరికి భయపడకుండా జరుగుతున్న ఈ రవాణా ఏజెన్సీ చట్టాలకే సవాల్ విసురుతోంది. వర్షాల కారణంగా ర్యాంపులు చెదిరిపోయినా, ఐదు ట్రాక్టర్లు తోసి మరొక ట్రాక్టర్ రోడ్డెక్కించడం, వాగు ఇసుకను గుట్టలుగా పోసి రాత్రింబగళ్లు తరలించడం మాఫియాకు ఎంత బలం వచ్చిందో బహిర్గతం చేస్తోంది. స్థానికులు ఆగ్రహంతో మాట్లాడుతున్నారు – "ఎవరికి చెప్పినా వినడం లేదు. ఎవరు చర్యలు తీసుకోవడంలేదు. మే ము చెప్పినా మాపైనే ఒత్తిడి పెడుతున్నారు" అని. ఇంకా ఎక్కువ ఆవేదన కలిగిస్తున్న విషయం ఏమిటంటే, ఈ దందా వెనుక పెద్దల ముసుగూ ఉం దన్న గుసగుసలు వినిపిస్తున్నాయి. రాజకీయ నేతల పేర్లు చెప్పి, ప్రజలను భయపెట్టడం, గిరిజనులను మౌనంగా ఉండేలా ఒత్తిడి తేవడం జరుగు తుందని స్థానికులు బహిరంగంగానే అంటున్నారు. "ఖద్దరు చొక్కా మాటు న ఈ దందా సాగుతోంది. మూడు పూవులు పది కాయలు అన్నట్టుగా ఇసుక ఎగుమతి జరుగుతోంది" అని గ్రామస్తులు మండిపడుతున్నారు. ఇంత జరుగుతున్నా అధికారులు మాత్రం కళ్ళు మూసుకుని కూర్చున్నట్టు కనిపిస్తున్నారు. తాసిల్దారు స్పందించి "అధికారులను పంపిస్తాం, చర్యలు తీసుకుంటాం" అని హామీ ఇచ్చినా, ఆ చర్యల జాడ మాత్రం ఎక్కడా కనబ డట్లేదు. మాటలకే పరిమితమవుతున్న అధికారుల నిర్లక్ష్యం మాఫియాకు మరింత ధైర్యం ఇస్తోంది. ప్రజలు ఒక్క మాటతో చెబుతున్నారు – "ఇసుక లేకపోతే ఎలా బతుకమంటారు? మేము బతకడం కోసం ఇసుక ఎత్తుకెళ్తున్నాం" అని. ఈ సమాధానం వినడం కంటే, ప్రజల సమస్యలకు ప్రత్యా మ్నాయ మార్గాలు చూపడం అధికారుల బాధ్యత కాదా? అన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ఇసుక దందా వల్ల పర్యావరణ నష్టం కూడా ముప్పు ముప్పుగానే ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. వాగుల పక్కన ఉన్న పంట పొలాలు, బావులు ఎండిపోతున్నాయని రైతులు చెబుతున్నారు. చిన్నచిన్న చెరువులు ఇసుక తీసేయడంతో పూడిపోతూ, తాగునీరు కూడా దొరకడం కష్టమవుతోందని వేదన వ్యక్తమవుతోంది. అభివృద్ధి పేరుతో, పేదలకు ఇళ్ల నిర్మాణం కోసం తీసుకెళ్లడమైతే వేరే విషయం. కానీ వ్యాపా ర దందా కోసం ఏజెన్సీ చట్టాలను తుంచేస్తూ ఇసుకను దోచుకోవడం గిరి జనులకు అసహ్యం కలిగిస్తోంది. ప్రజలు ఇప్పుడు ఒక్క మాటే చెబుతు న్నారు – "మా హక్కులను కాపాడండి, మా వాగులను కాపాడండి. ఇసుక దందాను ఆపండి" అని. అధికారులు మాటలకే పరిమితం కాకుండా, వాస్తవంగా చర్యలు తీసుకోవాలి. లేనిపక్షంలో ఈ మాఫియా మరింతగా బలపడుతుందనే భయం వారిని వేధిస్తోంది.





# ఓటు ఒక్కచోటే

- బోర్డర్ గ్రామాల్లో ఓటు హక్కుపై సందేహాలు
- వలస ప్రజల ఆస్తులు, రేషన్, ఓటు హక్కుపై చర్చలు
- అధికారులు పరిశీలన: ఓటు ఒక్కచోటే ఉండాలి




**భద్రాద్రి బ్యూరో, సెప్టెంబర్ 05 తొలి క్రాంతి:**
తెలంగాణ రాష్ట్రంలో ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, సరిహద్దు ప్రాంతాల్లో ఓటు హక్కుపై ప్రజలలో చర్చలు తీవ్రముగా కొనసాగుతున్నాయి. ముఖ్యంగా చత్తీస్‌గడ్ రాష్ట్రం నుంచి వలస వచ్చిన గుత్తి కోయ ప్రజల పరిస్థితులు ప్రధానంగా చర్చనీయాంశంగా మారాయి. ప్రజల అభిప్రాయంలో, వారు చత్తీస్‌గడ్‌లోనూ, తెలంగాణలోనూ రేషన్ కార్డులు, భూములు, ఆస్తులు కలిగి ఉండటంతో పాటు ఓటు హక్కు కూడా రెండుసార్లు పొందే అవకాశాలు ఉన్నట్లుగా అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ప్రజల ఆందోళన ప్రకారం, ఓటు ఒకే చోటే ఉండకపోవడం వల్ల స్థానిక ఎన్నికల్లో అసమతుల్యత, ద్విగుణిత లబ్ధి, స్థానిక ప్రజల హక్కుల లంఘనం వంటి సమస్యలు ఎదుర్కోవచ్చు. బోర్డర్ సరిహద్దు గ్రామాల్లో కొందరు వ్యక్తులు ఇక్కడ ఓటు హక్కు వినియోగించి, పక్క రాష్ట్రంలో కూడా ఓటు హక్కు ఉపయోగిస్తారని చర్చలు జరుగుతున్నాయి. ఈ పరిస్థితులు పల్లెలు, పట్టణాల వరకు ప్రజల ఆందోళనకు కారణమయ్యాయి. వలస ప్రజల ఆస్తులు, రేషన్, ఇతర లబ్ధులు సొంతం చేసుకున్నా, ఓటు హక్కు మాత్రం ఒకచోటే ఉండే విధానం కావాలి. లేకపోతే స్థానిక ఎన్నికల నిబద్ధత, ప్రజల నమ్మకం ప్రభావితమవుతుందని ప్రజలు భావిస్తున్నారు. కొందరు చెబుతున్నట్లుగా, అక్కడ ఇక్కడ ఓటు హక్కును కలిగి ఉండటం వల్ల అధికారుల దృష్టికి రావడం కష్టం అవుతుందనే భావన ఉంది. అధికారులు ఇప్పటికే పరిస్థితిని పరిశీలించారు. సరిహద్దు గ్రామాల్లో మరింత దృష్టి పెట్టి, ఒకరు ఒక్కచోటే ఓటు హక్కు కలిగేలా వ్యవస్థలో మార్పులు చేయాలని సూచనలు వినిపిస్తున్నాయి. అవసరమైతే సమస్యలు ఉన్న వారిని గుర్తించి, తగిన చర్యలు తీసుకోవడం ద్వారా ఎన్నికల నిబద్ధతను, ప్రజల నమ్మకాన్ని రక్షించవచ్చని అధికారులు భావిస్తున్నారు. ప్రజల చర్చల్లో, నిజంగా ఎవరు ఎక్కడ ఓటు హక్కు కలిగి ఉన్నారో స్పష్టత రావాల్సి ఉంది. అసత్య ప్రచారాలు, అనుమానాలు తప్పించడం, ప్రజలకు నిజమైన సమాచారం అందించడం అవసరమని భవిష్యత్ ఎన్నికల కోసం కాపాడుకోవాల్సిన అంశంగా ప్రజలు అభిప్రాయపడ్డారు. ఈ సమస్యపై సమగ్ర, సక్రమ పరిశీలన జరగడం ద్వారా మాత్రమే బోర్డర్ గ్రామాల్లో ఓటు వ్యవస్థ సక్రమంగా, న్యాయంగా ఉండగలదని ప్రజలు భావిస్తున్నారు. ప్రజలలో ఈ సమస్యపై చర్చలు పెరుగుతూ, వలస ప్రజల, స్థానికుల ఆందోళనలను, అధికారుల చర్యలను సమగ్రంగా అర్థం చేసుకోవాలని అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఓటు ఒక్కచోటే ఉండే విధానం అమలు చేయడం ద్వారా భవిష్యత్ ఎన్నికల్లో సరిహద్దు గ్రామాల్లో అవినీతి, అసమతుల్యత నివారించవచ్చని ప్రజలు భావిస్తున్నారు.





## అంకితానికి అవార్డు

- అశ్వరావుపేట మండలంలో సీడ్స్ కలెక్షన్ ఉత్తమ అవార్డు అందుకున్నది
- ఎమ్మెల్యే జారే ఆదినారాయణ, కలెక్టర్ వి జితీష్ వి పాటిల్ ఆధ్వర్యంలో ప్రదానం
- బాధ్యత, అంకిత భావం మరింత పెరిగినదని అవార్డు గ్రహీత ప్రకటన



**అశ్వరావుపేట, సెప్టెంబర్ 05 తొలి క్రాంతి:**
భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో సీడ్స్ కలెక్షన్ విభాగంలో అత్యుత్తమ ప్రదర్శన చూపిన ఉపాధ్యాయునిగా భూక్య నరసింహం ఎంపిక కావడం గురువారం ఘనంగా జరుపుకోబడింది. జిల్లా కలెక్టర్ వి జితీష్ వి పాటిల్, ఎమ్మెల్యే జారే ఆదినారాయణ మరియు జిల్లా అధికారుల ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా బెస్ట్ టీచర్స్ అవార్డ్స్ కార్యక్రమంలో నరసింహంకు ప్రత్యేక అవార్డు ప్రదానం చేశారు. భూక్య నరసింహ..మాట్లాడుతూ, "వృత్తి పట్ల అంకిత భావంతో బాధ్యతను పెంచుతూ, విద్యార్థుల భవిష్యత్తుకు ఉపయోగపడేలా కృషి చేయడం ఎప్పటికీ నా లక్ష్యం. బెస్ట్ ఉపాధ్యాయునిగా ఎన్నికవ్వడం, మరియు సీడ్స్ కలెక్షన్ లో బెస్ట్ కలెక్షన్ అవార్డు పొందడం ఎంతో గర్వంగా ఉంది. అవార్డు అతిరథుల చేతుల ద్వారా అందించడం ఈ ఘనతను మరింత ప్రత్యేకంగా చేసింది" అని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారులు, ఇతర అతిరథ మహారథులు, మరియు వివిధ వర్గాల అధికార ప్రతినిధులు పాల్గొని ఉపాధ్యాయుని ప్రతిభకు సత్కారం తెలిపారు. జిల్లా అధికారులు, "ప్రజలకు నాణ్యమైన విద్య అందించడంలో అంకిత భావంతో పనిచేసే ఉపాధ్యాయులే ప్రభుత్వ విధానాలను ముందుకు తీసుకెళ్తారు. భూక్య నరసింహం వంటి ఉపాధ్యాయుల కృషి మరింత మంది ఉపాధ్యాయులకు ఆదర్శంగా నిలుస్తుంది" అని పేర్కొన్నారు.

## అశ్వరావుపేటలో ఘన గురుపూజోత్సవం

- సర్వేపల్లి రాధాకృష్ణ జయంతి ఉత్సవంగా నిర్వహణ
- అశ్వరావుపేట, దమ్మపేట గురువులను సన్మానం
- లయన్స్ క్లబ్ నేతృత్వంలో ఘన కార్యక్రమం








**అశ్వరావుపేట, సెప్టెంబర్ 05 తొలి క్రాంతి:**
సెప్టెంబర్ 5న అశ్వరావుపేట లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో సర్వేపల్లి రాధాకృష్ణ జయంతి గురుపూజోత్సవ ఘనంగా జరిగింది. అశ్వరావుపేట, దమ్మపేట మండలాలకు చెందిన గురువులను ఈ సందర్భంలో సన్మానం చేశారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన లయన్స్ క్లబ్ అధ్యక్షుడు లక్కినేని నరేంద్ర బాబు. సన్మానితులలో యూఎస్ ప్రకాష్ రావు, అద్దంకి లక్ష్మీనారాయణ, గవర్నమెంట్ జూనియర్ కాలేజ్ లెక్చరర్ అరవింద్, కొఠారి చలపతిరావు, సీనియర్ ఉపాధ్యాయుడు సదాశివ మాస్టారు ఉన్నారు. సీనియర్ లైన్ మెంబర్స్ కోటగిరి మోహన్ రావు, బలమూరి సూర్య రావు, యూఎస్ ప్రకాష్ రావు, కొటారి చలపతిరావు, దార మల్లికార్జున రావు, ఐతమ్ వెంకటేశ్వరరావు, బ్రహ్మ రావు, దుర్గారావు దోపుకుంట్ల కార్యక్రమంలో పాల్గొని, గురువులను కొనియాడారు.

## ఏరియా కార్మికుల భవిష్యత్తుకు దారి చూపిన జీ ఎం సన్మానం

**మణుగూరు, సెప్టెంబర్ 05 తొలి క్రాంతి:**
గురువుల వలె కార్మికుల భవిష్యత్తుకు మార్గదర్శకంగా పని చేస్తున్న ఏరియా జనరల్ మేనేజర్ దుర్గం రామ చందర్ ను గురు పూజోత్సవం సందర్భంగా ఏరియా టి బి జి కె యస్ నాయకులు సన్మానించారు. వైస్ ప్రసిడెంట్ నాగెల్లి వేంకటేశ్వర్లు జ్ఞాపిక మరియు మిఠాయిలతో శుభాకాంక్షలు తెలిపారు. కార్మికులకు బంగారు భవిష్యత్తు అందించే నిత్య ఉపాధ్యాయుడిలా పనిచేస్తున్న జీ ఎమ్ దుర్గం రామచందర్ సేవలను గుర్తిస్తూ ఈ సన్మానం ఒక సంతోషకర ఘట్టమని వారు తెలిపారు. కార్యక్రమంలో బంగారి పవన్ కుమార్, మునిగే ల్ నాగేశ్వర రావు, సంపత్ కుమార్, కోన వెంకటేష్, గఫూర్, ఇమ్రాన్, కృష్ణ నరేష్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



తొలిక్రాంతి

శనివారం
6 సెప్టెంబర్ 2025



# క్రీడలకు కొత్త ఊపు

- ప్రతి పాఠశాలలో వారానికి 150 నిమిషాలు ఫిజికల్ యాక్టివిటీ
- ప్రతిభల విద్యార్థులకు జిల్లా స్టేడియంలో ప్రత్యేక శిక్షణ
- క్లస్టర్, మండల స్థాయిల్లో పోటీలతో స్పోర్ట్స్ కల్చర్ పెంపు



**ఖమ్మం, సెప్టెంబర్ 05 తొలి క్రాంతి:**
జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి ప్రభుత్వ పాఠశాలల్లో క్రీడలకు ప్రోత్సాహం ఇచ్చే చర్యలు ప్రారంభించారని ప్రకటించారు. పాఠశాలల ఫిజికల్ యాక్టివిటీ, క్రీడా నిర్వహణపై పిఈటి, కోచ్‌లతో సమావేశం నిర్వహించారు. విద్యార్థులు ఫిజికల్ ఫిట్నెస్ కాపాడుకోవడం, క్రీడల్లో పాల్గొనడం అవసరమని కలెక్టర్ అన్నారు. వారానికి 150 నిమిషాలు ఫిజికల్ యాక్టివిటీ తప్పనిసరిగా చేయించాలన్నారు. పాఠశాలల్లో క్రీడా రికార్డులు నిర్వహించి, ఖాళీ స్థలాలను స్థానిక సహకారంతో సిద్ధం చేయాలని సూచించారు.క్రీడా పోటీలలో ప్రతిభ చూపే విద్యార్థులను ఎంపిక చేసి జిల్లా స్టేడియంలో ప్రత్యేక శిక్షణ ఇచ్చి రాష్ట్ర, జాతీయ స్థాయిలకు సిద్ధం చేయాలని చెప్పారు. ప్రతి పాఠశాలల్లో స్పోర్ట్స్ కమిటీ ఏర్పాటు, తరగతుల వారీ టైమ్‌టేబుల్ తయారీని కలెక్టర్ ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా క్రీడా శాఖాధికారి సునీల్ రెడ్డి, పి.డి., పి.ఈ.టి, కోచ్‌లు మరియు ఇతర అధికారులు పాల్గొన్నారు.

## జ్ఞాన దీపాల ఉత్సవం



**దమ్మపేట, సెప్టెంబర్ 05 తొలి క్రాంతి:**
అశ్వరావుపేట నియోజకవర్గంలోని దమ్మపేట మండలంలో సెప్టెంబర్ 5న ఉపాధ్యాయ దినోత్సవం ఘనంగా నిర్వహించబడింది. మండల విద్యాశాఖ అధికారి కె. లక్ష్మి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి అశ్వరావుపేట శాసనసభ్యుడు జారే ఆదినారాయణ ప్రధాన అతిథిగా హాజరయ్యారు. మండలంలోని ప్రతిభావంతులైన 20 మంది ఉపాధ్యాయులను సన్మానించారు. ఉపాధ్యాయుల కృషి, విద్యార్థుల మేధో సామర్థ్యాన్ని పెంచే భూమికను ప్రశంసిస్తూ, ఈ కార్యక్రమం టీచర్ల బాధ్యతను మరింత పెంచేలా జరిగింది. కార్యక్రమంలో పోలీస్ సబ్ ఇన్స్పెక్టర్ సాయి కిషోర్ రెడ్డి, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, యూనియన్ నేతలు, సన్మాన గ్రహీతలు పాల్గొన్నారు.

## మధుసూదన్ రెడ్డి దశదిన ఘన నివాళులు



**పాల్వంచ, సెప్టెంబర్ 05 తొలి క్రాంతి:**
పాల్వంచ ఎస్ కన్వర్షన్ హాల్‌లో స్వర్గీయ గడ్డం మధుసూదన్ రెడ్డి దశదిన కార్యక్రమం ఘనంగా జరిగింది. జలగం యువసేన నాయకులు ఆయన చిత్రపటానికి పూలమాలలు అర్పించి ఘన నివాళులు సమర్పించారు. కుమారుడు రామకృష్ణారెడ్డి ని పరామర్శించి ధైర్యాన్ని ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఆయన పవిత్ర ఆత్మకి శాంతి చేకూరాలని భక్తులు ప్రార్థించగా, పాల్గొన్నవారు స్మరించారు.

# భద్రాద్రిలో ఉపాధ్యాయుల ఘన సన్మానం

- 57 మంది ఉత్తమ ఉపాధ్యాయులను సత్కరించాలి
- విద్యార్థుల సర్వత్ముఖాభి వృద్ధి కోసం గురువుల కృషి
- జిల్లా, మండలం స్థాయిలో ప్రత్యేక నిధులు మంజూరు

**భద్రాద్రి కొత్తగూడెం, సెప్టెంబర్ 05 తొలి క్రాంతి:**
భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ కార్యాలయం సమావేశ మందిరంలో తెలంగాణా రాష్ట్ర ప్రభుత్వం పాఠశాల విద్యాశాఖ ఆధ్వర్యంలో ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. కార్యక్రమంలో ముఖ్య అతిధిగా కొత్తగూడెం శాసన సభ్యులు కూనంనేని సాంబశివరావు పాల్గొని ఉపాధ్యాయులకు ప్రసంగించారు. ఉపాధ్యాయులు నిరంతరం నేర్చుకుంటూ, విద్యార్థుల సర్వత్ముఖాభి వృద్ధి కోసం శ్రద్ధగా పని చేయాలని ఆకాంక్షించారు. విశిష్ట అతిధిగా అశ్వారావుపేట శాసన సభ్యులు జారె ఆదినారాయణ, ఉపాధ్యాయుల బోధనా విధానాల ప్రభావాన్ని గుర్తు చేసుకుంటూ, విద్యార్థుల జీవితాల్లో గురువుల పాత్ర శాశ్వతమని అన్నారు. జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్, ఉత్తమ ఉపాధ్యాయుల ఎంపికపై అభినందనలు తెలిపారు.జిల్లా విద్యాధికారి బి నాగలక్ష్మి, ఉపాధ్యాయ దినోత్సవానికి జిల్లా, మండలం స్థాయిల్లో ప్రత్యేక నిధులు మంజూరైనట్లు తెలిపారు. 57 మంది ఉత్తమ ఉపాధ్యాయులను శాలువా, ప్రశంసా పత్రం, జ్ఞాపికలతో సత్కరించారు. ట్రైనీ కలెక్టర్ సౌరభ శర్మ, ఉపాధ్యాయ వృత్తి పవిత్రమైనదని గౌరవంతో తెలిపారు.కార్యక్రమం ప్రారం భానికి పాఠశాల విద్యార్థుల స్వాగత నృత్యాలు ఆకట్టుకు న్నాయి. పాఠశాలల, మండలాల కోఆర్డినేటర్లు, ప్రధానో పాధ్యాయులు, ఉపాధ్యాయ సంఘాల నాయకులు మరియు ఇతర అధికారులు ఈ వేడుకలో పాల్గొన్నారు.





# ఇళ్ల పరిసరాలు శుభ్రంగా ఉంచండి

- ప్రభుత్వ భవనాల శిథిల స్థితి గుర్తించి ప్రతిపాదనలు
- చెత్త, పిచ్చి మొక్కలపై చర్యలు తప్పనిసరి
- బాలకార్మిక పాఠశాలకు ఆధునిక భవనం కోసం ప్రణాళిక

**ఖమ్మం, సెప్టెంబర్ 05 తొలి క్రాంతి:**
ఖమ్మం నగరాన్ని పరిశుభ్రంగా ఉంచాలని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి ఆకలి పూర్వకంగా కోరారు. 57వ డివిజన్ లో కలెక్టర్ అదనపు కలెక్టర్ డా. పి. శ్రీజ, నగరపాలక సంస్థ కమిషనర్ అభిషేక్ ఆగస్త్య తో పర్యటించారు. రమణగుట్ట, వికలాంగుల కాలనీ ప్రాంతాలలో పారిశుద్ధ్య పరిస్థితులను పరిశీలిస్తూ, త్రాగునీరు, విద్యుత్, డ్రైనేజ్, రోడ్లు, ఖాళీ స్థలాలపై





అధికారులను అడిగి తెలుసుకున్నారు.కలెక్టర్ చెబుతూ, ఖాళీ ప్రైవేటు స్థలాల్లో చెత్త పేరకుండా, భూమి యజమానులు చర్యలు తీసుకోవాలని, అవసరమైతే జరిమానాలు విధించాలన్నారు. మురుగు నీటి నిల్వలు, గుంటలు వెంటనే శుభ్రం చేయమని, దోమల లార్వా నివారణ కోసం నీటిలో ఆయిల్ బాల్స్ ఉపయోగించాలని సూచించారు.వికలాంగుల కాలనీలో శిధిలభవనంలో ఉన్న బాలకార్మిక ప్రత్యేక పాఠశాలను కూడా పరిశీలించారు. ఇంగ్లీష్ మీడియం ప్రాథమిక పాఠశాల భవనం తొలగించి, ప్లే స్కూల్, అంగన్వాడి, ఆట వస్తువులు, కొత్త భవన నిర్మాణానికి ప్రతిపాదనలు ఇవ్వాలని మునిసిపల్ ఇంజనీరింగ్ అధికారులకు ఆదేశించారు. విద్యార్థుల కోసం ప్రత్యామ్నాయ ఏర్పాట్లు అందించాలన్నారు.తనిఖీ సమయంలో స్థానిక కార్పోరేటర్ రఫిదా బేగం ముస్తఫా, మునిసిపల్ ఇఇ కృష్ణలాల్, ఖమ్మం అర్బన్ మండల తహసీల్దార్ సైదులు, ఇతర సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# మట్టిమంట



- సెలవుల్లో మట్టిమాఫియా దూకుడు
- గిరిజనుల హక్కులు కాలరుస్తున్నాయి
- అధికారులు నిశ్శబ్దం సమస్య పెంచింది

**అశ్వారావుపేట, సెప్టెంబర్ 05 తొలి క్రాంతి:**
అశ్వరావుపేట మండలంలోని ఏజెన్సీ గ్రామాలు ఈ మధ్య కాలంలో మట్టిమాఫియాకి వేదికగా మారాయి. చిన్న చిన్న కొండలపై, ఎక్కడ చూసినా మట్టిని గుట్టుగా తవ్వడం, స్థానిక గిరిజనుల హక్కులను కాలరించడం పెద్ద సమస్యగా మారింది. గ్రామాల్లో మట్టిమాఫియా అడుగడుగునా దూకుడుపడుతూ, పర్మిషన్లు ఉన్నా, అధికారుల నిశ్శబ్దాన్ని అంచనా చేసుకుంటూ, "అధికారులకు చెప్పాం, చేసుకోమని అనుకున్నారు" అని చెబుతూ ప్రజలను భయపెడుతోంది. కొందరు గ్రామాల్లో జెసిబిలు మిషన్లు మట్టిని తవ్వడం, గిరిజనుల ఆర్థిక స్వరూపాన్ని నాశనం చేయడం ఇలా రోజురోజుకి పెరుగుతోంది.సెలవులు వచ్చి, అధికారులు దృష్టి నిలిపే లేకపోవడం కారణంగా, మట్టిమాఫియా కొండలను, పొలాలను తవ్వి, అమ్మి, గ్రామస్తుల జీవితాలను ప్రభావితం చేస్తోంది. మట్టితో సొంత లాభం చూడదలచిన వారిని ఎవరూ ఆపడం లేదు.గ్రామస్తులు, గిరిజనులు ఆవేదనతో చెబుతున్నారు, "మనం ఎంత ప్రయత్నించినా అధికారులు పట్టించుకోవడం లేదు. గిరిజనుల హక్కులు కాపాడుకోవాలంటే, మట్టిమాఫియాను అరికట్టాలి." ప్రతి కొండ, ప్రతి పొలం ఇప్పుడు గిరిజనుల ఆవేదనతో ఊపిరి పీలుస్తున్నాయి. స్థానికులు కోరుకుంటున్నది స్పష్టమే: సరైన అధికారులు వెంటనే చర్యలు తీసుకొని, మట్టిమాఫియాపై నిర్లక్ష్యం చూపకూడదుబీ గిరిజనుల హక్కులు, వారి భవిష్యత్తు రక్షించాలి.





# సర్వేపల్లి ఆదర్శం



**భద్రాద్రి కొత్తగూడెం, సెప్టెంబర్ 05 తొలి క్రాంతి:**
స్థానిక గ్రంథాలయంలో డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ చిత్రపటానికి పూలమాలలు వేసి పిసిసి సభ్యులు నాగ సీతారాములు, గ్రంథాలయ చైర్మన్ వీరబాబు నివాళులర్పించారు.అధ్యాపక వృత్తిలో మొదలైన సర్వేపల్లి ప్రస్థానం, భారతదేశ ఉపరాష్ట్రపతి, రాష్ట్రపతి స్థాయికి ఎదగడం, రాజకీయాల్లో చెరగని ముద్ర వేయడం గౌరవంగా గుర్తు చేసుకున్నారు. ఆయన జన్మదినాన్ని ఉపాధ్యాయ దినోత్సవంగా జరుపుకుంటూ, యువతకు సర్వేపల్లి జీవితం ఆదర్శమని, మంచి చదువుతో ఉన్నత స్థానాలకు చేరుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా, విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దే కృషి చేసిన గ్రంథపాలకురాలు జి. మనీ మృదులను సన్మానించడం జరిగింది.

# పార్టీ బలానికి కట్టుబడి

- కవిత సస్పెన్స్: శుభ పరిణామం
- పార్టీ కోసం కష్టపడాలి, వ్యక్తిగతం వద్దు
- కేసీఆర్ నిర్ణయం పార్టీకి మార్గదర్శకమే

**అశ్వరావుపేట, సెప్టెంబర్ 05 తొలి క్రాంతి:**
కల్వకుంట్ల కవితను పార్టీ నుండి సస్పెన్స్ చేయడం శుభ పరిణామం అని అశ్వరావుపేట మండల సీనియర్ బిఆర్ఎస్ నాయకులు మందపాటి రాజమోహన్ రెడ్డి వెల్లడించారు. స్థానిక పట్టణంలో గురువారం విడుదల చేసిన ప్రకటనలో ఆయన మాట్లాడుతూ, పార్టీని ధిక్కరిస్తే ఎవరికైనా కేసీఆర్ ఊరుకోరు అన్న విషయాన్ని కార్యకర్తలకు అర్థమయ్యే విధంగా చర్యలు చేపట్టడం జరుగుతుందని పేర్కొన్నారు.మందపాటి రాజమోహన్ రెడ్డి చెప్పినట్లుగా, "పార్టీలో అనేక మంది వస్తుంటారు, పోతుంటారు. ఎవరి స్థానుసారం పార్టీని ఉపయోగించుకొని ఇష్టమొచ్చినట్టు మాట్లాడితే కవితకి జరిగిన పరిణామాలు ఎవరికీ గుర్తింపు కావాలి. పార్టీ తల్లి లాంటి, కనుగుణంగా ఎవరు పని చేస్తారో చూసే విధంగా ఉండాలి. కేసీఆర్ తీసుకున్న నిర్ణయం శుభ పరిణామం. పూర్తి స్థాయిలో స్వాగతిస్తున్నాం" అని తెలిపారు. అంతేకాకుండా, ఆయన వర్గాలకోసం, వ్యక్తిగత ఆత్మనిర్మాణానికి కాకుండా పార్టీ శ్రేయస్సు ప్రధానమని, ప్రతి కార్యకర్త దీన్ని గమనించి కష్టపడి పనిచేయాలంటూ ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పలువురు బిఆర్ఎస్ నాయకులు పాల్గొని కార్యక్రమాన్ని మద్దతు తెలిపారు.



# ముళ్ల బందీ



- రహదారులపై పిచ్చి మొక్కల పట్టు
- ప్రాణాలు పణంగా ప్రయాణాలు
- అధికారుల నిర్లక్ష్యం తారాస్థాయిలో

**అశ్వారావుపేట, సెప్టెంబర్ 05 తొలి క్రాంతి:**
అశ్వరావుపేట మండలంలోని రహదారులు రాకపోకలకు కాకుండా ప్రమాదాల కేంద్రాలుగా మారాయి. ఇరువైపులా పెరిగిన పిచ్చి మొక్కలు, ముళ్ల పొదలు ఒక్కో రహదారిని గోడల్లా మూసేశాయి. ఎక్కడ చూసినా రింగ్ రింగ్‌లుగా తిరిగిన ముళ్లకంపలు వాహనదారుల ప్రాణాలపై దాడి చేస్తున్నాయి. ముఖ్యంగా మలుపుల్లో ఎదురెదురుగా వచ్చే వాహనాలు ఒకదానిని ఒకటి చూడలేక ఘోర ప్రమాదాలు జరుగుతున్నాయి.తరచూ కురుస్తున్న వర్షాలతో ఈ పిచ్చి మొక్కలు మరింత వేగంగా పెరిగిపోతున్నా, సంబంధిత శాఖలు మాత్రం నిద్రలో మునిగిపోయాయి. కనీసం తొలగించే చర్యలు కూడా లేకపోవడంతో వాహనదారులు, ప్రయాణికులు నిత్యం రిస్క్ తీసుకుంటూ రోడ్లపై వెళ్తున్నారు. రాత్రివేళల్లో దీపాల కాంతిలో కనిపించని



ముళ్ల పొదలు మరింత మృత్యుపాశాలుగా మారుతున్నాయి."మేము రోడ్లపై ప్రయాణం కాదు, మరణ యాత్ర చేస్తున్నాం" అని వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పిచ్చి మొక్కలతో నిండిపోయిన రహదారుల్లో ఎవరికీ చెప్పుకోవాలో తెలియక ప్రజలు రోధిస్తున్నారు. ఒకవైపు అధికారులు నిద్రలో, మరోవైపు ప్రమాదాలు వరుసగా జరుగుతుండడంతో మండల ప్రజలు భయాందోళనలో మునిగిపోయారు. రహదారులపై ఉన్న ఈ ముళ్ల బందీని వెంటనే తొలగించాలని, సురక్షితమైన ప్రయాణ వాతావరణం కల్పించాలని ప్రజలు సంబంధిత శాఖలను వేడుకుంటున్నారు. ఇక ఆలస్యం చేస్తే ఈ మార్గాలు మరణ రహదారులుగా మారతాయనే హెచ్చరికలు వినిపిస్తున్నాయి.